క్లుప్తంగా

సకాలంలో బిల్లులు చెల్లించండి

పుంగనూరు: విద్యుత్ వినియోగదారులు ప్రతి ఒక్కరూ సకాలంలో బిల్లులు చెల్లించాలని డీఈఈ శ్రీనివాసులు కోరారు. శనివారం ఆయన మాట్లాడుతూ బిల్లు ఇచ్చిన 15 రోజుల్లోపు బిల్లులు చెల్లించాలని, లేకుంటే అదనపు చార్జీలు పడతాయన్నారు. ఇలాంటి వాటికి అవకాశం లేకుండా బిల్లులు చెల్లించి, అభివృద్ధికి సహకరించాలని ఆయన కోరారు.

ఎంపీపీగా ధనుంజయరెడ్డి


ఎంపీపీని సన్మానిస్తున్న నేతలు

సదుం: ఎంపీపీగా వైస్ ఎంపీపీ-1గా ఉన్న ధనుంజయరెడ్డిని నియమించినట్లు అధికారులు శనివారం తెలిపారు. గతంలో ఎంపీపీగా ఉన్న ఎల్లప్ప గుండెపోటుతో మృతిచెందిన విషయం తెలిసిందే. నూతన ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన ధనుంజయరెడ్డిని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, హరినాథరెడ్డి, శివారెడ్డి, రమణారెడ్డి సత్కరించారు.

వైద్య విద్య ప్రమాణాలను పెంపొందించాలి


సదస్సు ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ క్రిష్ణారావు

గుడుపల్లె: కాలానుగుణంగా మారుతున్న పరిణామాలను దృష్టిలో ఉంచుకుని వైద్య విద్య విధానాల ప్రమాణాలను పెంపొందించాలని పీఈఎస్ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ హెచ్‌ఆర్ క్రిష్ణారావు పేర్కొన్నారు. శనివారం పీఈఎస్ కళాశాలలో వైద్యవిద్యా విధానం గురించి నిర్వహించిన సదస్సును ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు సంబంధించిన వైద్యులతో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పీజీ వైద్య విద్యార్థుల కోసం జంతువుల కాట్లు, విష ప్రయోగం, మానవులు జంతువుల పర్యావరణ పరస్పర సంబంధం అనే కార్యక్రమంపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. ఈ విధానాలతో 2030 నాటికి రేబిస్‌ను నిర్మూలించడం అనే గ్లోబల్ లక్ష్యానికి మద్దతు తెలిపారు.

ఆదర్శ విద్యార్థుల ప్రతిభ


విజేత విద్యార్థులు

రొంపిచెర్ల: రాష్ట్ర స్థాయి పోటీల్లో రొంపిచెర్ల ఆదర్శ పాఠశాల విద్యార్థులు గెలుపొందినట్లు ప్రిన్సిపల్ సరళ శనివారం తెలిపారు. గతనెల 29న వారధి వార్షిక రాష్ట్రస్థాయి పోటీలను ఆన్‌లైన్‌లో నిర్వహించారు. ఈ పోటీల్లో రొంపిచెర్ల ఆదర్శ పాఠశాలలో పదవ తరగతి చదువుతున్న భరత్‌కుమార్, రిషిత, 8వ తరగతి చదువుతున్న గురుశరణ్ ఆన్‌లైన్‌లో నిర్వహించిన చిన్న కుటుంబాలు వరం కాదు శాపం అనే అంశంపై చర్చా వేదికలో పాల్గొని విజయం సాధించారు. విజేతలను శనివారం ఎంపిక చేశారని తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఒక్కరికి రూ.5 వేలు చొప్పున ముగ్గురికి రూ.15 వేలు బహుమతిగా ఇచ్చినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. వీరికి మార్గ సందర్శకులుగా సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయురాలు కుమారి వ్యవహరించారు. గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపల్, ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

పంటలపై ఏనుగుల దాడులు


ఆవుల పెద్దిరెడ్డిగారి పల్లెలో ఏనుగులు తొక్కేసిన వరిపంట

కల్లూరు(పులిచెర్ల): మండలంలో పంటలపై ఏనుగుల దాడులు ఆగడంలేదు. ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట పంటలను నాశనం చేస్తూనే ఉన్నాయి. తాజాగా శనివారం తెల్లవారుజామున మండలంలోని ఆవుల పెద్దిరెడ్డిగారి పల్లె, చిట్టారెడ్డి పేటల్లో ఏనుగుల గుంపు పంట పొలాలపై దాడి చేసి ధ్వంసం చేసింది. ముఖ్యంగా వరి పైరును ఏనుగులు తొక్కి నాశనం చేశాయి. చేతికొచ్చిన పంటను తీవ్రంగా నష్టపోయిన రైతులు దిగులు చెందుతున్నారు. అటవీశాఖ అధికారులు నష్టపోయిన పంటలను పరిశీలించి ఉన్నతాధికారులకు తెలియ జేస్తామన్నారు.

అన్నదాన భవనం పరిశీలన

కాణిపాకం: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయక స్వామి దేవస్థానంలో నూతనంగా నిర్మిస్తున్న అన్నదానం భవన నిర్మాణ పనులను శనివారం ఈఓ గురుప్రసాద్ పరిశీలించారు. పనుల్లో జాప్యం లేకుండా చూడాలని, నాణ్యత జరగాలన్నారు. నిధుల మంజూరు, చెల్లింపులు, పెండింగ్ బిల్లులపై ఆరా తీశారు.


గంటావూరు బడిలో మధ్యాహ్నభోజనం పెడుతున్న దృశ్యం


ఇటుకరాళ్లపల్లి బడి వద్ద పిచ్చిమొక్కలు


గంటావూరులో ఆగిన నాడు నేడు పనులు

అప్పుచేసి.. పప్పుకూడు!

- భారంగా మధ్యాహ్న భోజనం
- మండుతున్న నిత్యావసర ధరలు
- అవస్థలు పడుతున్న నిర్వాహకులు
- ఇప్పటికీ గత ప్రభుత్వ మెనూ ధరలే
- కొండెక్కిన నాడు-నేడు పనులు
- ప్రభుత్వ బడులపై అంతులేని నిర్లక్ష్యం


కడపసత్తం హైస్కూల్‌లో ఆరుబయట భోజనం చేస్తున్న విద్యార్థులు

నియోజకవర్గంలో మొత్తం ప్రభుత్వ పాఠశాలలు	
ప్రైమరీ, యూపీ, హైస్కూళ్లు మొత్తం	: 469
ఎయిడెడ్	: 02
కస్తూరిబా పాఠశాలలు	: 02
పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య	: 52,200
ఉపాధ్యాయుల సంఖ్య	: 1,650
ఉండాల్సిన ఉపాధ్యాయుల సంఖ్య	: 1,710

పలమనేరు: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం విద్యకు పెద్దపీట వేసింది. మనబడి నాడునేడు ద్వారా ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను మార్చేసింది. తల్లిదండ్రులు వారి పిల్లలను సర్కారు బడికే పంపేలా చేసింది. కానీ పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వ బడుల్లో ఇప్పుడు సమస్యలు రాజ్యమేలుతున్నాయి. ముఖ్యంగా మధ్యాహ్న భోజనానికి ప్రభుత్వం అందించే ధరలు పెరగకపోగా నిత్యావసరాల ధరలు మండిపోతుండడంతో నిర్వాహకులకు వంట పెనుభారంగా మారింది. అసలే అప్పోసప్పో చేసి పిల్లలకు భోజనం పెడుతున్న నిర్వాహకులకు ఠంచనుగా బిల్లులందకపోవడం వారికి మరింత ఇబ్బందిగా మారింది. దీంతో శుచికర, నాణ్యమైన భోజనం పిల్లలకు దూరమైందనే మాట వినిపిస్తోంది. నియోజకవర్గంలో 90శాతం బడుల్లో మల, మూత్రశాలలు శుభ్రంగా లేవు. విద్యార్థులు ఆరుబయటే మూత్ర విసర్జన చేయాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రహరీ గోడలు లేక, నాడునేడులో అర్ధంతరంగా ఆగి మొండిగోడలు ఇప్పుడు దర్శనమిస్తున్నాయి.

మెనూ అమలుకు తప్పని తిప్పలు...

నిబంధనల మేరకు సోమవారం పొంగల్, గుడ్డు, చిక్కీ, మంగళవారం పులిహోరా, టమాట చెట్నీ, దొండకాయ, గుడ్డు, బుధవారం వెజిటబుల్ రైస్, ఆలుకుర్మా, గుడ్డు, చిక్కీ, గురువారం సాంబార్‌బాత్, ఎగ్, శుక్రవారం అన్నం, ఆకుకూరపప్పు, గుడ్డు, చిక్కీ, శనివారం ఆకుకూర అన్నం, పొంగల్, పప్పుచారుగా పెట్టాలి. ఇందుకోసం ప్రాథమిక పాఠశాలలకు విద్యార్థికి రూ.5.88పైసలు, ఉన్నత పాఠశాలలకు రూ.8 దాకా నిర్వాహకులకు అందిస్తున్నారు. ఈ మెనూ ధరలు గత ప్రభుత్వంలోనివే. ఈ ప్రభుత్వం ఇంకా డబ్బులు పెంచలేదు. అయితే ఇప్పుడు నిత్యావసరవస్తువులు, కూరగాయల ధరలు ఆకాశాన్నంటుతున్నాయి. దీంతో నిర్వాహకులకు ఖర్చులు పెరిగి ప్రభుత్వం ఇచ్చే డబ్బు చాలడం లేదు. ఫలితంగా భోజన నాణ్యత తగ్గింది. మరోవైపు నిర్వాహకులకు ఠంచనుగా ఆయా నెల బిల్లులు రాక వాళ్లు అప్పుచేసి వంట వండాల్సిన పరిస్థితి నెలకొంది. వంట నిర్వాహకులకు నెల ఆలస్యంగానైనా కేంద్ర ప్రభుత్వ నిధులు వస్తున్నా, రాష్ట్ర ప్రభుత్వ నిధుల ఆలస్యంతోనే ఇబ్బందిగా మారింది

బడుల్లో అసౌకర్యాలే

నియోజకవర్గంలో 90శాతం బడుల్లో మల, మూత్రశాలలు కంపుకొడుతున్నాయి. కొన్నింటిని వాడకుండా తాళాలేసేశారు. ఫలితంగా పిల్లలు ఆరు బయట కెళ్లి మూత్ర విసర్జన చేస్తున్నారు. దసరా సెలవుల తర్వాత బడుల్లో పిచ్చిమొక్కలు పెరిగాయి. 20 బడులకు ప్రహరీగోడలు లేక ఇబ్బందిగా ఉంది. వి.కోట మండలంలోని కరిప్పల్లి జెడ్పీ హైస్కూల్ పొలాల మధ్యన ఉంది. దీంతో తరచూ బడిలోకి పాములు వస్తున్నట్టు పిల్లలు చెబుతున్నారు. ముఖ్యంగా నాడునేడు రెండవ విడత పనులు ఇంకా మొదలు కాలేదు.

పీడిస్తున్న టీచర్ల కొరత

నియోజకర్గంలో ఇంకా 60 పోస్టుల అవసరం ఉంది. వి.కోట మండలంలోని కొమ్మరిమొడుగులో 1 నుంచి ఏడు తరగతులకు నలుగురే టీచర్లున్నారు. 12 పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడే దిక్కుగా మారింది. హైస్కూళ్లలో సైతం టీచర్ల కొరత కారణంగా కంబైన్డ్ క్లాసులు జరిపించాల్సిన అవసరం నెలకొంది.

బస్‌షెల్టర్‌ను కూల్చేశారని ఫిర్యాదు


కూలిపోయిన బస్ షెల్టర్

గుడుపల్లె: కుప్పం నుంచి పలమనేరుకు వెళ్లే రోడ్డులోని పీఈఎస్ మెడికల్ కళాశాల దగ్గరలోని నల్లగాంపల్లె క్రాస్ వద్ద ఉన్న బస్‌షెల్టర్‌ను గుర్తు తెలియని దుండగులు కూల్చేశారని శనివారం తహసీల్దార్ శీతారాంకు ఫిర్యాదు చేశారు. బస్ కోసం వేచి ఉండేందుకు నిర్మించిన బస్‌షెల్టర్‌ను రాత్రి సమయంలో దుండగులు కూల్చేశారన్నారు. బస్‌షెల్టర్ రాత్రికి రాత్రే పడిపోవడం అందరికీ అనుమానాలు దారితీస్తున్నాయన్నారు. కూల్చేశారని అనుమానం ఉందని వారిపై చర్యలు తీసుకోవాలని నల్లగాంపల్లె గ్రామస్తులు కోరుతున్నారు. ప్రభుత్వం నిర్మించిన భవనాలకే దిక్కు లేకుండా పోయిందని ఆవేదన చెందారు.

వర్షం.. పంట నష్టం


దెబ్బతిన్న వరిపంట

సదుం: మండలంలో అల్పపీడన ప్రభావంతో కొద్ది రోజులుగా కురుస్తున్న వర్షాలతో పలుచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. చేతికొచ్చే సమయంలో పంటలు దెబ్బతినడంతో ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు. తాటిగుంటపాలెం పంచాయతీ పరిధిలో రెడ్డి చెరువు, బొజ్జవాని కుంట కింద 13 మంది రైతులకు చెందిన సాగులో ఉన్న 12 ఎకరాలలో వరిపంట నేల రాలినట్లు వారు ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే నూర్పిడి కోసం బండపై కోతకోసి ఉంచిన 250 బస్తాల వరి దెబ్బతిందని చెప్పారు. కాగా పంట నష్టపోయిన రైతులు రైతు సేవా కేంద్రాల్లో వివరాలు అందించాలని ఏఓ హరిప్రసాద్ సూచించారు.

లైంగిక వేధింపులు ఆపాలి


ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

రొంపిచెర్ల: మహిళలపై లైంగిక వేధింపులు మానుకోవాలని గ్రేట్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షుడు జీవీఎస్.బాబు అన్నారు. ఆయన శనివారం రొంపిచెర్ల పురవీధుల్లో వాక్ ఫర్ ఫ్రీడమ్ నిశ్శబ్ద నడక కార్యక్రమంపై విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సమాజంలో మహిళలపై లైంగిక వేధింపులు ఎక్కువ అవుతున్నాయని తెలిపారు. బాల్య వివాహాలను నిర్మూలించి, వెట్టి చాకిరి లేకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓలు ఇందిర, శ్రీనివాసులు, బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం లక్ష్మీదేవి, సంస్థ ప్రతినిధులు డాక్టర్ రఘునాథ్, కవిత, ఓబులేసు, అశోక్ పాల్గొన్నారు.

కానరాని సమయపాలన


సచివాలయం గేట్ ముందు ప్రజలతో చర్చిస్తున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట : సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడం లేదని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు తెలిపారు. ఆయన శనివారం మండలంలోని ఓగు సచివాలయాన్ని ఆయన ఆకస్మికంగా తనిఖీ చేయడానికి వెళ్లారు. ఉదయం 11.30 గంటలకు సచివాలయం తాళం వేసి వుండడంతో అవాక్కయ్యారు. బయట వేచి ఉన్న ప్రజలతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. సిబ్బందికి ఇంత నిర్లక్ష్యమా అంటూ స్థానిక ఎంపీడీఓకు ఫోన్ ద్వారా సమాచారం అందించి సచివాలయ ఉద్యోగులు ఎక్కడకెళ్లారు అని ఆరా తీశారు. అనంతరం అందుబాటులోలేని ఉద్యోగులకు నోటీసులు పంపాలని జెడ్పీ చైర్మన్ ఆదేశించారు.

కార్యకర్తకు జెడ్పీ చైర్మన్ నివాళి

మండలంలోని గోనుమాకులపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త శీనప్ప శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు వారి స్వగృహానికి చేరుకుని శీనప్ప పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళలర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు.

సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించాలి


మాట్లాడుతున్న ఏఓ ఫయాజ్

పుంగనూరు: మారుతున్న కాల పరిస్థితులకు అనుగుణంగా రైతులు సాంకేతిక పరిజ్ఞానంతో పంటలు పండించడంలో మెలకువలు వహించాలని వ్యవసాయాధికారి ఫయాజ్ తెలిపారు. శనివారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని చంద్రమాకులపల్లెలో రైతులతో కలసి నిర్వహించారు. ఈసందర్భంగా డ్రోన్ ద్వారా విత్తనాలు, మందులు వేసే కార్యక్రమాన్ని ప్రయోగాత్మకంగా వివరించారు. ఏఓ మాట్లాడుతూ రైతులు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి అధిక దిగుబడులు సాధించేందుకు వీలుందన్నారు. తక్కువ మంది కూలీలతో ఎక్కువ పంటలకు మందులు చల్లడం, విత్తనాలు వేయడం డ్రోన్ ద్వారా నిర్వహించవచ్చునని తెలిపారు. రైతులకు ఎదురయ్యే సమస్యలను, సలహాలను శాస్త్రవేత్తల ద్వారా రైతులకు అందిస్తామని తెలిపారు. రైతులందరూ ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకుని ఆదర్శ రైతులుగా నిలవాలని కోరారు.

వంద శాతం వసూలు చేయాలి

- డీపీఓ పార్వతి


రికార్డులను పరిశీలిస్తున్న డీపీఓ పార్వతి

వి.కోట: మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో వంద శాతం ఇంటి పన్నులు వసూలు చేయాలని చిత్తూరు డీపీఓ పార్వతి ఆదేశించారు. డీపీఓ పట్టణంలోని గ్రామ సచివాలయం-1 ను శనివారం తనిఖీ చేసి మండలంలోని పంచాయతీ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్యం లోపించకుండా, నీటి నిల్వలు ఉండకుండా చూడాలని ఫాగింగ్ చేసి దోమల నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. నూతనంగా విధుల్లో చేరిన సిబ్బంది కార్యాలయాల్లో 34 రికార్డులను అందుబాటులో ఉంచాలని సూచించారు. ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన నిధులను నిర్దేశించిన పనులకే కేటాయించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది పలు సమస్యలను ఆమె దృష్టికి తీసుకొచ్చారు. పంచాయతీ కార్మికులే గ్రామాభివృద్ధికి మూలస్తంభాలని వారి సంక్షేమం గ్రామపంచాయతీ బాధ్యతని తెలిపారు. వి.కోటను సర్వాంగసుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. ఎంపీడీఓ ఈశ్వరన్, సర్పంచ్ పీఎస్ లక్ష్మి, ఈఓ శివశంకర్, ఇంచార్జ్ ఈఓపీఆర్డీ వెంకటరమణ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రిలో కంటి పరీక్షలు

పుంగనూరు: పట్టణంలోని ఎన్ఎస్.పేటలోని ఏరియా ఆస్పత్రిలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్నట్లు డాక్టర్ గ్రీష్మబిందు తెలిపారు. శనివారం ఆమె ఆస్పత్రిలో కంటి సమస్యలు ఉన్న వారికి పరీక్షలు చేశారు. అవసరమైన వారికి ఆపరేషన్లు నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు.

గురుకుల పాఠశాల తనిఖీ


విద్యార్థినులతో జూనియర్ సివిల్ జడ్జి లిఖిత

- తనిఖీ చేసిన జూనియర్ సివిల్ జడ్జి

పలమనేరు: పట్టణ సమీపంలోని ప్రభుత్వ గురుకుల పాఠశాలను స్థానిక జూనియర్ సివిల్ జడ్జి లిఖిత శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థినులకు అందుతున్న భోజనం, భోజనశాలలో వంటలు ఎలా చేస్తున్నారు, నిత్యావసర వస్తువులను ఎలా నిల్వ ఉంచుతున్నారని నిశితంగా గమనించారు. విద్యార్థినులు ఆరోగ్యంగా ఉండాలంటే మంచి నాణ్యమైన ఆహారాన్ని అందించాలని సూచించారు. పిల్లలకు ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. పాఠశాలలో పారిశుధ్యం బాగుండాలని, పిల్లలు సైతం వ్యక్తిగతంగా పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. న్యాయవిజ్ఞాన సదసులో భాగంగా కార్యక్రమాన్ని హైకోర్టు, స్థానిక సీనియర్ సివిల్ జడ్జి శ్రీనివాసరావు ఆదేశాల మేరకు చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయవాద సంఘ కార్యదర్శి బర్కర్ పాల్గొన్నారు.

ఉపాధి మంజూరులో వివక్ష ఎందుకు?


మాట్లాడుతున్న జెడ్పీటీసీ సోమశేఖర్‌రెడ్డి

సదుం: ఉపాధి పనుల మంజూరులో అధికారులు ఎందుకు వివక్ష చూపుతున్నారని జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్‌రెడ్డి, సభ్యులు ప్రశ్నించారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. కేవలం టీడీపీ నాయకుల పనులకు మాత్రమే అనుమతులు ఇచ్చి..మిగిలిన వారికి ఎందుకు ఉపాధి పనులు మంజూరు చేయడం లేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీల్డ్ అసిస్టెంట్లు, సర్పంచ్‌ల ఆమోదం లేకుండా పనులు ఎలా మంజూరు చేస్తున్నారని చెప్పారు. ఇలా చేస్తే తాము పనుల తీర్మానాలను ఆమోదించేది లేదని సర్పంచ్‌లు స్పష్టం చేశారు. గత ఐదేళ్లలో అప్పటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి చొరవతో పెద్ద ఎత్తున్న అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించామని జెడ్పీటీసీ సభ్యుడు తెలిపారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధిలో పోటీపడాలని సూచించారు. అభివృద్ధికి తామంతా సహకరిస్తామని చెప్పారు. ఏకపక్ష నిర్ణయాలను సహించేది లేదన్నారు. ప్రతినెల 15 వతేదీ వరకు కూడా బియ్యం అంగన్‌వాడీ కేంద్రాలకు సరఫరా కాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు ఐసీడీఎస్ సూపర్ వైజర్ మల్లీశ్వరి సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. 5వ తేదీ లోపు బియ్యం అందేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దారు మారుఫ్ హుస్సేన్ చెప్పారు. కొత్త వడ్డిపల్లె, దిన్నె వడ్డిపల్లెలో నూతన బోర్లు మంజూరు చేయాలని ఎంపీటీసీ సభ్యుడు మల్లికార్జున కోరారు. వర్షాలతో పంట నష్టపోయిన రైతులు వివరాలు అందించాలని ఏఓ హరిప్రసాద్ కోరారు. తిమ్మానాయనపల్లె మార్గంలో ఆర్టీసీ బస్సు నడపాలని సర్పంచ్ మురళీ రెడ్డి కోరారు. ఎంపీపీ ధనుంజయరెడ్డి, ఎంపీడీఓ రాజశేఖర్ బాబు, వైస్ ఎంపీపీ అమరావతి, కో-ఆప్షన్ సభ్యుడు ఇమ్రాన్, ఈఓపీఆర్డీ వరప్రసాద్ పాల్గొన్నారు.

ఫ్లోరెన్స్ నైటింగేల్ ఆదర్శం


హాజరైన నర్సింగ్ విద్యార్థులు

కుప్పంరూరల్: నర్సింగ్ విద్యార్థులు ఫ్లోరెన్స్ నైటింగేల్‌ను ఆదర్శంగా తీసుకోవాలని బీసీ ఎన్ విద్యా సంస్థల చైర్మన్ బీసీ నాగరాజు అన్నారు. శనివారం ఇంజినీరింగ్ కళాశాల ఆవరణలో 'నర్సింగ్ దీపం వెలిగించే' కార్యక్రమాన్ని చేపట్టారు. దీపాలు వెలిగింపు తరువాత బీసీ నాగరాజు మాట్లాడారు. నర్సింగ్ పూర్తిచేసుకున్న వారు ఎక్కడ ఉన్నా రోగుల పట్ల సేవాభావంతో మెలగాలని సూచించారు. డా.బాలాజి మాట్లాడుతూ రోగులను చేతులతోనే కాకుండా మనస్సుతో చూడాలన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ సునీల్‌రాజ్, సీఈఓ సాగర్‌రాజ్, నర్సింగ్ కళాశాల ప్రిన్సిపల్ విమల జోసెఫ్, అధ్యాపకులు ఉన్నారు.

వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్


అధికారులతో సమావేశమైన ఎస్ఈ

పుంగనూరు: విద్యుత్ వినియోగదారులకు ఎలాంటి ఆటంకం లేకుండా నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేస్తామని జిల్లా ఎస్ఈ ఇస్మాయిల్ అహ్మద్ తెలిపారు. శనివారం ఆయన పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్లను, కార్యాలయాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఈఈ శ్రీనివాసమూర్తి, డీఈఈ శ్రీనివాసులుతో కలసి విద్యుత్ సరఫరా, బిల్లులు, బకాయిలు, ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు, లేన్ల మరమ్మతు, లేన్ల ఏర్పాటు విషయాలపై చర్చించారు. ఈ సందర్భంగా అన్ని ప్రాంతాల్లోనూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను అందించాలన్నారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలపై తక్షణం స్పందించాలని, సిబ్బంది నిర్లక్ష్యం వహించరాదని సూచించారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకొస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఏఈలు మహేంద్రరెడ్డి, ధనుంజయమూర్తి, సబ్ ఇంజినీర్ నవీన్ పాల్గొన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో చర్యలకు రంగం సిద్ధం

- ఆయా పీహెచ్‌సీ డాక్టర్లకు నోటీసులు జారీ

సాక్షి ఎఫెక్ట్..


ఓగు పీహెచ్‌సీలో శుభ్రం చేస్తున్న దృశ్యం

పలమనేరు: పలమనేరు నియోజకవర్గంలోని ప్రభుత్వాస్పత్రుల్లో నెలకొన్న సమస్యలపై జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారిని డా.ప్రభావతిదేవి అవసరమైన చర్యలను చేపట్టారు. ఆమే రకు స్థానిక సాక్షి దినపత్రికలో శుక్రవారం ప్రచురితమైన 'వైద్యం అంతంత మాత్రమే' శీర్షికపై ఆమె తీవ్రంగా స్పందించి సంబంధిత మండలాల ఆరోగ్య వైద్యాధికారులకు నోటీసులు జారీ చేశారు. దీంతో పలమనేరు మండలంలోని కొలమాసనపల్లి పీహెచ్‌సీలో పిచ్చిమొక్కలను అధికారులు తొలగించారు. అక్కడి మరుగుదొడ్లను అందుబాటులో ఉంచేలా చర్యలు తీసుకుంటామని డా.సుధారాణి తెలిపినట్టు పేర్కొన్నారు. వి.కోట మండలంలోని ఓగు ఆస్పత్రి వద్ద మురుగునీటి గుంతను తోడి చర్యలు తీసుకోవాలని డీఎంహెచ్ఓ ఆదేశించారు. అలాగే వైద్య సిబ్బంది తక్కువగా ఉన్నచోట తగిన చర్యలను తీసుకుంటామని తెలిపారు. రాయలపేట ఆస్పత్రి ప్రాంగణంలో పారిశుధ్యపనులు చేపట్టనున్నట్టు అందులో తెలిపారు. ఇదే రీతిలో సంబంధిత మండలాల వైద్యులు తగిన చర్యలను తీసుకోనున్నట్టు పేర్కొన్నారు. ఏదేమైనా ప్రభుత్వ ఆస్పత్రుల్లో సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు స్పందించిన తీరుపై సామాన్య ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.